



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శుక్రవారం
సాయంత్రం - 6.34
సహర్ - శనివారం
ఉదయం - 4.56

కమనీయం.. కల్యాణ వైభోగం

- వైభవంగా వేంకటేశ్వరస్వామి లగ్నం
- రావిచెడ్‌కు భారీగా తరలివచ్చిన భక్తజనం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ జిల్లాలో ఖ్యాతిగాంచిన రావిచెడ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణానికి రావిచెడ్‌తో పాటు కడ్తాల, తలకొండపల్లి, ఆమనగల్లు, కందుకూరు, కేశంపేట తదితర మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

- కడ్తాల్, మార్చి 21



ఎండ వేడిమి.. ఈతతో ఉపశమనం

స్విమ్మింగ్‌పూల్స్‌లో సేదతీరుతున్న యువకులు, విద్యార్థులు

ఎండలు మండిపోతున్నాయి. ప్రచండ భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. దాంతో ఉక్కిరిబిక్కిరవుతున్న విద్యార్థులు, యువకులు స్విమ్మింగ్ పూల్స్, బావుల్లో జలకాలాడుతున్నారు. మండుటెండలకు ఈతకు వెళ్లి ఒకింత ఉపశమనం పొందుతున్నారు. వేసవి నేపథ్యంలో ఆమనగల్లు పట్టణం సమీపంలోని విఠాయిపల్లి, మేడిగడ్డ గేటు సమీపంలో గల స్విమ్మింగ్ పూల్‌లు యువకులు, విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. కాగా, గంటకు రూ.100 చొప్పున నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయినా కదా సేదతీరేందుకు ఏమాత్రం ఖర్చుకు వెనుకాడటం లేదు.

- ఆమనగల్లు, మార్చి 21

చేవెళ్లకు రంజిత్.. మల్కాజిగిరికి సునీత

లోక్‌సభ అభ్యర్థుల ఖరారు

జాబితా విడుదల చేసిన కాంగ్రెస్





రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : రాజకీయ వర్గాలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల కీలక జాబితా ఎట్టకేలకు విడుదలైంది. దేశవ్యాప్తంగా మొత్తం 57 మందితో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల మూడో జాబితా విడుదల చేయగా.. తెలంగాణలోని మరో 5 స్థానాలకు అభ్యర్థులను గురువారం ప్రకటించింది. ఇందులో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. అదేవిధంగా మల్కాజిగిరి నుంచి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. కాగా, చేవెళ్ల పార్లమెంట్ టికెట్ కోసం ఈ ఇరువురూ పోటీపడ్డారు. టికెట్ ఆశించిన వారిద్దరూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అయితే, వారిద్దరిలో టికెట్ ఎవరికి ఇవ్వాలనే విషయంపై గందరగోళ పరిస్థితులు ఏర్పడగా.. చివరకు చేవెళ్ల ఎంపీ టికెట్ రంజిత్‌రెడ్డికి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. మల్కాజిగిరి ఎంపీ టికెట్ సునీతా మహేందర్‌రెడ్డికి కట్టబెట్టింది. కాగా, ముందు నుంచీ 'ఆంధ్రజ్యోతి' చెప్పినట్టుగానే చేవెళ్ల, మల్కాజిగిరి టికెట్లు రంజిత్‌రెడ్డి, సునీతారెడ్డికి దక్కాయి.

హెచ్‌ఐవీ-ఎయిడ్స్ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- హెచ్‌ఐవీ-ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజేందర్



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి రాజేందర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : హెచ్‌ఐవీ-ఎయిడ్స్ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హెచ్‌ఐవీ-ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీఎం అండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెల్త్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌పై రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ, హెచ్‌ఐవీ-ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్తంగా హెచ్‌ఎంఐయస్ పోర్టల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ-ఎయిడ్స్‌పై సందేహాలుంటే.. ఉచిత హెల్ప్‌లైన్ నంబర్-1097కు ఫోన్‌చేసి సలహాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ, లైంగిక సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్, అదనపు అధికారి డాక్టర్ అరుణ, జిల్లా హెచ్‌ఐవీ-ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది రాజేందర్, నరేందర్, శ్రీశైలం, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది, ప్రభుత్వాసుపత్రిలోని రిపోర్టింగ్ సూపర్ వైజర్లు, డీఈవోలు, సబ్‌సెంటర్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఒకప్పుడు ప్రజలు తాగేందుకు, పంటలకు స్వచ్ఛమైన నీరందించిన చెరువులు నేడు మానవ తప్పిదాలతో కాలుష్య కేంద్రాలుగా మారుతున్నాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు యథేచ్ఛగా మురుగు నీటిని వదులుతుండటంతో చెరువుల్లోకి చేరి కలుషితం అవుతున్నాయి. దాంతో చెరువులు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. షాద్‌నగర్ పట్టణ సమీపంలోని జానమ్మ చెరువు, గంపల చెరువు, సుర సముద్రం చెరువుతో పాటు లింగారెడ్డిగూడ పోచమ్మ చెరువు మురుగు నీటితో కలుషితమయ్యాయి. చెరువుల్లోకి కలుషిత నీటిని ఇలాగే వదిలితే భూగర్భజలాలు కూడా కలుషితం అవుతాయని, ఇప్పటికైనా అధికారులు చెరువులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



చటాన్‌పల్లి సుర సముద్రం చెరువు వద్ద పడేసిన వ్యర్థాలు

చెరువులు.. కాలుష్య కాసారాలు!

మునిసిపాలిటీలు, గ్రామాల మురుగు నీరు చేరిక

- ఒకప్పుడు తాగునీరు, పంట నీరు అందించిన తటాకాలు
- మానవ తప్పిదాలతో నేడు కలుషిత నీటి కేంద్రాలు
- ఇలాగే వదిలితే భూగర్భ జలాలూ కలుషితమయ్యే ప్రమాదం
- చెరువులను పరిరక్షించాలంటున్న ప్రజలు

షాద్‌నగర్ రూరల్, మార్చి 21 : పట్టణం నుంచి వెలువడుతున్న కలుషిత నీటిని చెరువుల్లో వదులుతుండడంతో చెరువులన్నీ కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. గతంలో ఏళ్ల పాటు ప్రజలకు తాగునీటిని అందించిన చెరువులు, కుంటలు మానవ తప్పిదాలతో కలుషిత నీటికి కేంద్రాలుగా మారాయి. గ్రామాల్లోనూ చెరువుల్లో చెత్త పడేస్తూ కలుషితం చేస్తున్నారు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన చెరువులు.. ఇప్పుడు మురుగు నీరు నిండటంతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

కళ చెదిరిన జానమ్మ చెరువు

వనపర్తి రాజు రాజా సవై వెంకట్‌రెడ్డి నాడు తన తల్లి జానమ్మ పేరిట పెద్ద జానమ్మ(నేటి ఫరూఖ్‌నగర్) గ్రామాన్ని నిర్మించి గ్రామానికి పడమట దిక్కున జానమ్మ చెరువును తవ్వించాడు. గ్రామ ప్రజల దాహార్తిని తీర్చిన జానమ్మ చెరువు నేడు కలుషిత నీటితో నిండింది. షాద్‌నగర్ పట్టణం విస్తరిస్తున్న కొద్దీ కలుషిత నీరు చెరువులో చేరడం ఎక్కువైంది. చెరువులోకి కలుషిత నీరు రాకుండా గతంలో ప్రణాళికలు రూపొందించారు. కానీ, వాటిని అమలు చేయలేదు. షాద్‌నగర్ నుంచి వెలువడుతున్న ఎక్కువ శాతం నీరు జానమ్మ చెరువులోకి వెళుతోంది. చెరువు నీరు కలుషితం కావడంతో దానిపై ఆధారపడిన మత్స్యకారులు, రజకులు తమ వృత్తిని కొనసాగించలేని పరిస్థితి. రజకులకు దోబీఘాట్లు నిర్మించినా.. అవి నిరుపయోగంగా మారాయి. మునిసిపాలిటీల నుంచి వెలువడుతున్న నీటిని శుద్ధిచేసి వదలాలని, మురుగు నీరు నేరుగా చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గంపల చెరువులో వ్యర్థాల పడవేత

ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో పరిగి రోడ్డుపక్కన ఉన్న గంపల చెరువు ఒకప్పుడు స్వచ్ఛమైన నీటికి నెలవు. ప్రస్తుతం చెరువులో చెత్త పారబోస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్నా.. ఈ చెరువులో కొందరు నిత్యం చెత్త వేస్తున్నారు. అయినా, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువును కాపాడి వానకాలంలో చేరే నీటిని సంరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కలుషిత నీటితో నిండిన లింగారెడ్డిగూడ చెరువు

కాలుష్యమయంగా సుర సముద్రం చెరువు!

షాద్‌నగర్ మునిసిపాలిటీ పరిధి చటాన్‌పల్లి శివారులో గల సురసముద్రం చెరువులోకి దాబాల నుంచి మురుగు నీరు చేరి కలుషితమైంది. బైపాస్ రోడ్డు దూసకల్ చౌరస్తాలో రోడ్డు కిరువైపులా ఉన్న దాబాల నుంచి వెలువడే కలుషిత నీరు సుర సముద్రం చెరువులోకి చేరుతోంది. దాంతో చెరువు నీరు పనికి రాకుండా పోయింది. సుర సముద్రం చెరువులో ఒకప్పుడు చటాన్‌పల్లి మత్స్యకారులు చేపలు పెంచేవారు. నాలుగైదేళ్ల నుంచి చెరువులో మురుగు నీరు చేరి చేపలు మృత్యువాత పడుతున్నాయి. దాంతో చెరువు నీరు దేనికీ పనికి రావడం లేదు. చెరువు కట్టపై పురాతన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఇక్కడికి నిత్యం భక్తులు వస్తుంటారు. కాళ్లు, చేతులు కడుక్కోవడానికి కూడా నీరు పనికి రావడం లేదు. మురుగునీటి వల్ల దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని చటాన్‌పల్లి గ్రామస్తులు మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.



మొగిలిగిద్ద గంపల చెరువు పక్కన పడవేసిన వ్యర్థాలు

భూగర్భ జలాలూ కలుషితమయ్యే ప్రమాదం

చెరువుల్లో చేరుతున్న కలుషిత నీటితో రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోనూ భూగర్భజలాలు కలుషితమయ్యే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భజలాలు కలుషితమయ్యాయి. అలాగే చాలాచోట్ల బోర్లలో ఫ్లోరైడ్ నీరే వస్తోంది. రానురాను బోర్లలో వచ్చే నీటితో వ్యవసాయం కూడా చేయలేని పరిస్థితి నెలకొంటుందని రైతులు భయపడుతున్నారు. కలుషిత నీటిని పంటలకు పెట్టలేని పరిస్థితి. సాగుకు ఏమాత్రం పనికి రాకుండా పోతుందని వాపోతున్నారు. చాలా గ్రామాల్లో బోరు నీటిని తాగలేక ఆర్వో వాటర్‌ను కొనుక్కొని తాగుతున్నారు. ఇప్పటికైనా చెరువుల్లోకి కలషిత నీరు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగుతో లింగారెడ్డిగూడ పోచమ్మ చెరువు

ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో పోచమ్మ చెరువు పాడి పంటలకు నిలయం. కానీ, నేడు ఈ చెరువు కలుషిత నీరుతో నిండింది. షాద్‌నగర్ నుంచి వెలువడే కొంత మురుగు నీరు ఇందులో చేరుతోంది. అలాగే పాటుకాలువ ద్వారా మురుగు నీరు చెరువులోకి చేరుతోంది. మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలిచ్చినా పట్టించుకోలేదు. ఎండాకాలంలో పశువులు కూడా ఈ చెరువు నీరు తాగలేని పరిస్థితి నెలకొంది.

చెరువులను కాపాడాలి



లింగారెడ్డిగూడలో గల పోచమ్మ చెరువులో నీరు పూర్తిగా కలుషితమైంది. షాద్‌నగర్ పట్టణం నుంచి వెలువడే కలుషిత నీరు చెరువులో చేరకుండా చర్యలు తీసుకోవాలి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరింత నష్టం జరుగుతుంది.

- చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, లింగారెడ్డిగూడ

అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రజలు చెత్త వేయడంతో మొగిలిగిద్దలోని గంపల చెరువు నీరు కలుషితమవుతోంది. అధికారులు గ్రామస్తులతో కమిటీ వేసి తగిన చర్యలు తీసుకోవాలి. అందుకు సహకరించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. చెరువులకు కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- సిరాజుద్దీన్, మొగిలిగిద్ద

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

- బ్యాంకర్లకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : బ్యాంకర్లు అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఈనెల 16న వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, జూన్ 6 వరకు అమల్లో ఉంటుందన్నారు. రూ.లక్షకు పైగా డబ్బుల లావాదేవీలు జరిపితే ఖచ్చితంగా వివరాలు తెలియజేయాలన్నారు. జిల్లాలోని ఏటీఎంలలో డబ్బులు పెట్టేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏజెన్సీలు పెద్దమొత్తంలో డబ్బు తరలించాలంటే.. తెలంగాణ సీఈవోనుంచి అనుమతి పొందాలన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి. క్యాష్ జనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికల్ నంబర్లను తనిఖీ చేయాలని, ప్రతీరోజు క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి ఖర్చుల వివరాలతో పాటు కొత్త ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించుటకు బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు ఎపిక్ కార్డు వివరాలతో పూర్తి సమాచారం అందజేయాలన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం వంటిది

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం అని, అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో స్వీప్‌పై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండినవారు ఎపిక్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, పరిగి, తాండూరు వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయన్నారు. శేరిలింగంపల్లిలో అత్యధికంగా ఓటర్లున్నట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని, ఈసారి శాతం పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వీకే రన్ నిర్వహించాలని, పోస్టర్లతో ప్రచారం చేయాలని సూచించారు. గ్రేటర్ కమ్యూనిటీ రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచాలని, మహిళా సంఘాలు, విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఎల్డీఎం కుసుమ, జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, డీఈవో సుశీందర్‌రావు, పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీదేవి, వివిధ బ్యాంకు ప్రతినిధులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సైదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'టిమ్స్' పనుల్లో వేగం పెంచాలి

- వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు



బిల్డింగ్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న క్రిస్టినా చోంగ్తు

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రి పనులను వేగిరం చేయాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కొత్తపేట, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి కలెక్టర్ శశాంకతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌళిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న కొత్తపేట టిమ్స్ ఆసుపత్రి పనులను జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్‌అండ్‌టీ ఇంజనీర్లు వివరించారు. ఆసుపత్రి పనుల పరిశీలనలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ విమలా థామస్, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కోటచింతల బసవేశ్వరస్వామి జాతర


మరికల్ కోటచింతల ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కులకచర్ల, మార్చి 21: చౌడాపూర్ మండలం మరికల్, కిష్టంపల్లి గ్రామ పరిధిలోని శ్రీకోటచింతల బసవేశ్వరస్వామి జాతర ఉత్సవాలను గత నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం పూజారి మఠం సిద్దయ్య ఆధ్వర్యంలో తెల్లవారుజామున అగ్నిగుండం, రథోత్సవ కార్యక్రమాలు, శ్రీశివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, పాండురంగయ్య, సత్యకుమార్, శ్రీనివాసులు, దామోదర్, నరేందర్, శివుడు, మల్లికార్జున్, ప్రభులింగం, రమేశ్, రాజేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో తూనికలు, కొలతలశాఖ జిల్లా అధికారి



రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉమారాణి, మల్లేశం

కొత్తూర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ సింగబోయిన ఉమారాణి, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ డి. మల్లేశంలు రూ.10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు చిక్కారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ సమీపంలోని నాట్కో పరిశ్రమ ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్ల నిర్వహణ కాంట్రాక్టును యాజమాన్యం తూనికలు, కొలతల శాఖ లైసెన్స్ ఉన్న ఎస్.గిరిధర్‌రావుకు అప్పగించింది. వెయింగ్ మిషన్లకు ప్రతి సంవత్సరం స్టాంపింగ్ వేయాలి. ఈ క్రమంలో వాటి స్టాంపింగ్ కోసం గిరిధర్‌రావు జిల్లా తూనికలు, కొలతల కార్యాలయం అధికారులను ఆశ్రయించారు. అయితే అందుకు రూ.10 వేలు ఇవ్వాలని ఉమారాణి డిమాండ్ చేశారు. దాంతో గిరిధర్‌రావు ఏసీబీ అధికారులను ఆశ్రయించి వారి సూచన మేరకు గురువారం రూ.10 వేలు తీసుకొని కార్యాలయానికి వెళ్లారు. ఉమారాణి ఆదేశం మేరకు ఆ డబ్బును మల్లేశంకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు.



మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

» సీడీపీవో నాగమణి

కేశంపేట, మార్చి 21 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని షాద్‌నగర్ సీడీపీవో నాగమణి సూచించారు. మండల పరిధిలోని కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో హాజరై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ చిరుధాన్యాలు ఆహారంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని అన్నారు. చిన్నారుల ఆరోగ్యంపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శమంత, విజయలక్ష్మీ, దివ్యాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా.. 'పది' పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన మూడో పేపర్.. ఇంగ్లీష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 50,895 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 50,744 మంది హాజరయ్యారు. మిగతా 151 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరు 99.70 శాతం నమోదైంది. అలాగే ప్రైవేట్ విద్యార్థులకు సంబంధించి 93 మంది విద్యార్థులకుగాను 76 మంది పరీక్ష రాశారు. 17మంది విద్యార్థులు హాజరు కాలేకపోయారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ 68 మంది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

ముగిసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

» చివరి రోజు వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కల్యాణ ఉత్సవంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు, టీటీడీబోర్డు మెంబర్ సీతారెడ్డి

పరిగి, మార్చి 21: పరిగిలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు గురువారం ఉదయం వేద పారాయణం, స్వామివారికి అభిషేకాలు, శ్రీలక్ష్మీ హోమం, శ్రీవెంకటేశం, శ్రీఆంజనేయ, నాగధ్వజహోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు కూర్చుని జరిపించారు. కల్యాణోత్సవానికి పట్టణ ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. సాయంత్రం స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. పట్టణంలో ఆట, పాటలు, భజనల మధ్య స్వామివారిని ఊరేగించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల, పెద్దలతో ఆధ్యాత్మిక ప్రవచనాలను నిర్వహించారు. మూడు రోజులపాటు భక్తులకు ఏర్పాట్లు, నీళ్ల, భోజనాలపై నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షించారు. చివరిరోజు తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డిలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో పురోహితులు సిద్ధాంతి పార్థసారథి, రేపల్లి రాజుశర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌పీ బాబయ్య, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎంపీపీ సత్తమ్మ, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, భీంరెడ్డి, కార్యదర్శులు కె.హన్మంత్, వైస్ఎంపీపీ కె.సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, పరిగి, పూడూరు, కులకచర్ల మండలాల పార్టీ అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, బీఎస్ ఆంజనేయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారాన్ని నిర్మిస్తామని జడ్పీటీసీ బి.హరిప్రియ ప్రవీణ్‌రెడ్డి తన తల్లిదండ్రులు యశోదమ్మ, గోపాల్‌రెడ్డి ప్రకటించారు.

కేంద్రంలో మూడోసారీ బీజేపీ ప్రభుత్వమే



మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న కోట మర్పల్లి నాయకులు

మర్పల్లి, మార్చి 21: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని చేవెళ్ల మాజీ ఎంపీ, ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి మండలంలోని కోట మర్పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీకి దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో ఎంతో ఆదరణ ఉందన్నారు. ఎక్కడ చూసినా బీజేపీ ప్రభుత్వ అభివృద్ధే కనిపిస్తోందన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో మర్పల్లి మండల అభివృద్ధికి రూ.40లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఒకప్పుడు దేశాన్ని చిన్న చూపు చూసిన దేశాలన్నీ ప్రస్తుతం భారత్ సాయం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఎస్సీ సెల్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శివరాజ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరం

బంట్వారం(కోట్‌పల్లి): వారసత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని డీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం కోట్‌పల్లి బుగ్గాపురం, లింగంపల్లి, అన్నాసాగర్, బార్వాద్ గ్రామాలకు చెందిన ప్రతిపక్ష పార్టీలకు చెందిన సుమారుగా 300 మంది నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు దేశాలకు ఏ అవసరం వచ్చిన వాళ్లకు గుర్తు వచ్చేది మొదటి పేరు భారత దేశం అని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం బీజేపీకే ఉందన్నారు. సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రధాని మోదీ రూ.9వేల కోట్లు సాయం చేయకుంటే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదికాదన్నారు. తాను గెలుపొందితే కోట్‌పల్లి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తానన్నారు. ఇటీవలే అనంతగిరి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయించినట్లు గుర్తుచేశారు. మరోసారి ఎంపీ అయ్యాక ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మారుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, జిల్లా కోశాధికారి సతీష్ పాండుగౌడ్, రాజు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్ సందీప్ మరియు సీనియర్ నాయకులు మూడు గ్రామాల ప్రజలు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అన్ని వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలు

చేవెళ్ల, మార్చి 21 : దేశంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాయని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అత్యంత శక్తి వంతుడని కొనియాడారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని సంకేపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, భద్రయ్య, వారి అనుచరులు విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచారు. ప్రజాసేవే లక్ష్యంగా తాను ప్రజల ముందుకు వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సంకెపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు వైభవ్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా రైలు టికెట్ల కొనుగోలు

ప్రయోగాత్మకంగా

14 స్టేషన్లలో 31 కౌంటర్ల ఏర్పాటు

హైదరాబాద్, మార్చి21(ఆంధ్రజ్యోతి): రైల్వేలో డిజిటల్ చెల్లింపులను పెంపొందించే చర్యల్లో భాగంగా టికెట్లను కొనుగోలు చేసేందుకు క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ సేవల్ని దక్షిణమధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద చిల్లర కోసం పడే పాట్లు తప్పనున్నాయి. మొదటి దశలో ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ డివిజన్‌లో 14 స్టేషన్లలోని 31 కౌంటర్ల ద్వారా వినియోగదారులకు ఈ నగదు రహిత లావాదేవీల సదుపాయం కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ముఖ్యమైన సమాచారం, చార్జీలు తదితర వివరాలను సూచించే డిస్‌ప్లే బోర్డులను బుకింగ్ కౌంటర్ల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే డిస్‌ప్లే బోర్డులో కన్పించే క్యూఆర్ కోడ్‌ను ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లో ఉన్న పేమెంట్ యాప్ ద్వారా స్కాన్ చేసుకుని అవసరమైన రుసుమును జమచేయాలని, తర్వాత టికెట్ జనరేట్ అవుతుందని పేర్కొన్నారు. తొలి దశలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, బేగంపేట, వరంగల్, మంచిర్యాల్, లింగంపల్లి, హైటెక్‌సిటీ, జేమ్స్‌స్ట్రీట్, మహబూబాబాద్, బెల్లంపల్లి, ఫతేనగర్‌బ్రిడ్జ్, సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మెషిన్(ఏటీవీయం)లోని క్యూఆర్ కోడ్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్ల కొనుగోలు చేసే విధానం రెండేళ్లుగా అమలులో ఉంది. తాజాగా యూటీఎస్(జనరల్ బుకింగ్) కౌంటర్లలోనూ ఈ సదుపాయం కల్పించడం విశేషం.

సీఎంను కలిసిన చల్లా నర్సింహారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న చల్లా నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : డీసీసీ అధ్యక్షుడు, పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల చల్లాను చైర్మన్‌గా నియమించిన సందర్భంగా ఆయన సీఎంకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కట్టబెట్టిన పదవికి న్యాయం చేస్తానని చల్లానర్సింహారెడ్డి చెప్పారు. సీఎంను కలిసిన వారిలో మీర్‌పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవితాబాల్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల మౌనికశ్రీశైలం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పి. శేఖర్‌రెడ్డి, మురళీగౌడ్, విజయ్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, కీసరి యాదిరెడ్డి, పరుశురాం తదితరులున్నారు.



సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్, మార్చి 21: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి బుధవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే తనకు సముచిత స్థానం కల్పించడం పట్ల గురునాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

» టీఎస్ఆర్టీసీ ఎండీ సీవీ సజ్జనార్



సదస్సును ప్రారంభిస్తున్న టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఘట్‌కేసర్, మార్చి 21: యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన టెక్ అండ్ ఫార్మా సంప్రతి 2024 సదస్సును ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అనేక మంది యువకులు నిత్యం జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధానంగా బైక్ నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు ఉన్నప్పటికీ అనేక మంది పాటించకుండా ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. యువత ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబాలు ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని గుర్తుచేశారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. నేడు యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి ఎంతో విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వ్యసనాలకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యార్థులు కొత్తకొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు 18 కళాశాలలకు చెందిన 2వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తున్నట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు రామారావు, కళాశాల చైర్మన్ నల్ల నర్సింహారెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఆయా విభాగాల డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై నోటీసులతోనే సరి

» రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు అధికారుల వెనుకంజ

» కోర్టులను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు



తాండూరు, మార్చి 21: తాండూరులో అక్రమ నిర్మాణాలపై అధికార పార్టీకి చెందిన రాజకీయపార్టీల నేతల జోక్యంతో బల్దియా అధికారులు చర్యలు తీసుకోనేందుకు జంకుతున్నారు. అక్రమ నిర్మాణాలపై స్వయంగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదు. తమ వార్డులో అక్రమ నిర్మాణం జరుగుతుందని వార్డు కౌన్సిలర్ సాహు శ్రీలత చేసిన ఫిర్యాదుపై శివాజీచౌక్‌లో అక్రమ నిర్మాణం దారులకు బల్దియా అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. శాంతినగర్‌లో నిర్మిస్తున్న మూడు అంతస్థుల భవనం నిర్మాణంపై ఇప్పటికే మాజీ కౌన్సిలర్ అనురాధ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. శివాజీ చౌక్‌లో దుకాణాల సముదాయం నిర్మాణాలపై కౌన్సిలర్ సాహు శ్రీలత కోర్టును ఆశ్రయించారు. కొడంగల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జికింద నాలాపక్కనే రెండవ ఫ్లోర్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా చర్యలు చేపట్టలేదు.

వృద్ధిరేటు సాధించాల్సిందే..!

» లేదంటే మున్సిపాలిటీలకు కేంద్ర గ్రాంట్ బంద్

» పన్నువసూళ్లలో వెనుకబడిన నాలుగు మున్సిపాలిటీలు

» సగటు వృద్ధి రేటు 11.93శాతం

» పూర్తిగా వెనుకంజలో తాండూరు మున్సిపాలిటీ



తాండూరు, మార్చి 21: మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు రావాలంటే ఆస్తిపన్ను వసూళ్లను మెరుగుపర్చుకోవాల్సి ఉంది. 15వ ఆర్థికసంఘం నిధులను పొందేందుకు మున్సిపాలిటీలు గత ఆర్థిక సంవత్సరంతో పోల్చినప్పుడు ఆస్తిపన్ను వసూళ్లలో స్థిరమైన మెరుగుదల చూపాలని, సాధారణ సగటు వృద్ధిరేటుకు మెరుగుదల ఉండాలని రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రం ఈ వృద్ధిరేటు ఐదు సంవత్సరాల సగటు వృద్ధిరేటు పరిణామంలోకి తీసుకుంటుంది. 2018-19 నుంచి 2022-23 సంవత్సరం వరకు సగటు వృద్ధిరేటును తీసుకుంటుంది. ఈ లెక్కన రాష్ట్ర సగటు వృద్ధి రేటు 11.93శాతంగా నిర్ధారించారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 11.93శాతం సాధించాల్సిందే. లేదంటే కేంద్రప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్స్‌ను అన్నింటినీ నిలిపివేస్తుంది. జిల్లాలో వృద్ధిరేటు సాధించడంతో జిల్లాలోనే ముందంజలో ఉన్న తాండూరు మున్సిపాలిటీ ఈ ఏడాదిఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ విభాగం నిర్లక్ష్యం కారణంగా వెనుకబడి పోయిందని చెప్పవచ్చును. వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు దగ్గరలో ఉన్నాయి.

మున్సిపాలిటీ	2022-23 ఆస్తిపన్ను వసూళ్లు రూ. కోట్లలో	2023-24 ఆస్తిపన్ను వసూళ్లు రూ. కోట్లలో	పీటీ గ్రోత్ రేటు	గోల్ సాధించడానికి వసూలు చేయాల్సిన ఆస్తిపన్ను రూ. కోట్లలో
వికారాబాద్	356.56	295.12	-17.23	103.98
తాండూరు	410.65	279.98	-31.82	179.66
పరిగి	138.85	119.53	-13.91	35.88
కోడంగల్	94.59	92.48	-2.23	12.47

రెవెన్యూ ఇక్కడ.. పీఎస్ అక్కడ..!



పోలీస్‌స్టేషన్ కోసం సిద్ధం చేసిన పంచాయతీ భవనం

కులకచర్ల, మార్చి 21: జిల్లాల పునర్విభజనలో భాగంగా చౌడాపూర్ మండలం రెండు ముక్కలైందని గ్రామస్థులు అంటున్నారు. ఇక్కడ రెవెన్యూ పరిధి చౌడాపూర్ మండలం, పోలీస్‌స్టేషన్ మహబూబ్‌నగర్ నవాబుపేట మండలంలో ఉన్నాయి. దీంతో మరికల్, కొత్తపల్లి, కల్మన్‌కాల్వ, చాకల్‌పల్లి, పురసంపల్లి, కిష్టంపల్లి, మల్కాపూర్, బంగరంపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పోలీస్‌స్టేషన్‌ను తిరిగి కులకచర్ల పీఎస్‌కు మార్చాలని ఆయాగ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఈపరిస్థితి నెలకొందని వాపోతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆయాగ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో విలీనమయ్యాయి. చౌడాపూర్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేయగా ఆ గ్రామాలు అందులోకి వచ్చాయి. పీఎస్ మార్చకపోవడంతో అప్పట్లో అధికారులు చేసిన తప్పిదాలకు గ్రామస్థులు ఇప్పుడు నానా అవస్థలు పడుతున్నారు. చౌడాపూర్ మండలంలో గల మరికొన్ని గ్రామాలు కులకచర్ల పీఎస్ పరిధిలో కొనసాగుతున్నాయి. చౌడాపూర్‌లో పీఎస్ ఏర్పాటు కావడం లేదు. పీఎస్ ఏర్పాటుతో పాటు నవాబుపేట పీఎస్ పరిధిలో ఉన్న గ్రామాలను చౌడాపూర్‌లో మారుస్తారని నూతన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు.



యాచారం బస్టాండ్‌లో బస్సును తనిఖీ చేస్తున్న డిపో మేనేజర్ రాజీవ్‌ప్రేమ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బస్సులు ఆపకపోతే కఠిన చర్యలు

» బస్సులను తనిఖీ చేసిన డీఎం

యాచారం, మార్చి 21 : యాచారం బస్టాండ్‌లో దేవరకొండ డిపోకు చెందిన బస్సులను ఆపకపోతే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డ్రైవర్, కండక్టర్లను ఆ డిపో మేనేజర్ రాజీవ్‌ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. యాచారంలో ఆగని దేవరకొండ డిపో బస్సులు అనే శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. యాచారం బస్టాండ్‌లో దేవరకొండ డిపోకు చెందిన బస్సులను ఆయన గురువారం తనిఖీ చేశారు. స్వయంగా ప్రయాణికులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. బస్సులు ఆపకపోతే తనకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. యాచారం బస్టాండ్‌లో తాత్కాలికంగా ఓ కంట్రోలర్‌ను నియమించారు.

నూతన ఆవిష్కరణలకు జీవం

» సీవీఆర్ కళాశాలలో ఉత్సాహంగా ప్రారంభమైన సియన్‌సియా-2024



మాట్లాడుతున్న డీఆర్‌డీఎల్ డైరెక్టర్ బాల మురళి కృష్ణన్

ఆదిభట్ల, మార్చి 21 : విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లు చేసేటప్పుడు మూస పద్ధతులకు పోకుండా వినూత్నంగా ఆలోచించాలని, అప్పుడే నూతన ఆవిష్కరణలకు జీవం పోయగలమని డీఆర్‌డీఎల్ సంస్థ హైదరాబాద్ డైరక్టర్ డాక్టర్ బాల మురళి కృష్ణన్ విద్యార్థులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే సియన్‌సియా-2024 గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాల మురళి కృష్ణన్, కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ వి చెరబుడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామ్మోహన్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినూత్నంగా ఆలోచించినప్పుడే పోటీ ప్రపంచంలో సక్సెస్ కాగలమన్నారు. రక్షణ రంగం, ఏరోస్పేస్ విభాగాల్లో కూడా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని అన్నారు. విద్యార్థుల ఆవిష్కరణలు వివిధ రంగాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. తమ కళాశాల 23 సంవత్సరాల్లో సాధించిన ప్రగతిని కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ వి చెరబుడ్డి వివరించారు. ఫలితాల ఆధారిత విద్య ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రామ్మోహన్‌రెడ్డి వివరించారు. మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఫర్ ఇంజనీర్స్ వర్క్‌షాప్, వెబ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, వర్క్‌షాప్ ఆన్ లింక్డ్ ఇన్ అండ్ రెజ్యూమ్ బిల్డింగ్, లాంగ్ చైన్ వర్క్‌షాప్ లాంటి కార్యక్రమాలు మొదటి రోజు జరిగాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి విజయమేర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు



సీఎంతో జంగారెడ్డి, తదితరులు

కందుకూరు, మార్చి 21 : కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అధిష్టానం ఎల్లప్పుడు గుర్తింపు నిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి చెప్పారు. గురువారం జంగారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని సీఎం నివాసానికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కందుకూరులోని సమస్యలను పరిష్కరించాలని, తనకు రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కేటాయించాలని జంగారెడ్డి సీఎంను కోరారు. కార్యక్రమంలో దెబ్బడగూడ మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, నాయకులు ఏనుగు లక్షిత్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై వీవోలకు అవగాహన



సమావేశంలో మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు

తలకొండపల్లి, మార్చి 21 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం మండల మహిళా సమాఖ్య ఏపీఎం శ్రీదేవి ఆధ్వర్యంలో వీవోలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఓటు నమోదు, వినియోగం, చేర్పులు, మార్పుల గురించి ఆమె వారికి చెప్పారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. అదే విధంగా మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వీప్‌లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల పనితీరు, రుణాల మంజూరు, రికవరి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, కోశాధికారి రమాదేవి, సీబీవో ఆడిటర్ కృష్ణ, సీసీ దీప, పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

కేశంపేట, మార్చి 21 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి సేవలు మరువలేనివని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు రాంమోహన్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. వెంకటస్వామి వర్ధంతిని సందర్భంగా గురువారం ఎంఆర్‌సీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, కృష్ణయ్య, చిన్నారావు, రవికుమార్, అప్పారావు, నారాయణరావు, యాదయ్య, మల్లేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న సంధ్య, జగన్

ఆమనగల్లు, మార్చి 21 : విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని శెట్టిపల్లి మాజీ సర్పంచ్ కోట్ల జగన్, మాజీ ఎంపీటీసీ కోట్ల సంధ్య అన్నారు. విద్య సమాజంలో అంతరాలను తొలగించి ప్రగతికి బాటలు వేస్తుందని వారు చెప్పారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెట్రి బాక్స్‌లను వారు సమకూర్చి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పేద విద్యార్థులను ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలని వారు కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటయ్య, చంద్రమౌళి, రాములుగౌడ్, యాదయ్య, కేశయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 21 : దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని మాడ్గుల జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహద పడుతాయని వారు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామంలో ఈనెల 24 నుంచి 31వ తేది వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను గురువారం ఆమనగల్లు పట్టణంలో వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, డోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఓం ప్రకాశ్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

షాబాద్, మార్చి 21 : ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత అన్నారు. ఇటీవల కల్వ సుజాతను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించడంతో షాబాద్ ఆర్యవైశ్య సంఘం నాయకులు నగరంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో ఆర్యవైశ్యుల చిరకాల కోరిక నెరవేరిందని ఆమె అన్నారు. సంఘం నాయకులు శ్రీనివాస్‌గుప్తా, పూర్ణచందర్‌గుప్తా, అశోక్ గుప్తా, నవీన్‌గుప్తా, దయానంద్‌గౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు

● గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

● ఐసీడీఎస్ అధికారుల సూచనలు



మాడ్గుల : ప్రతిజ్ఞ చేయిస్తున్న బాలమణి

మాడ్గుల, మార్చి 21 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇర్విన్ సెక్టార్‌లో పోషకాహారం ప్రాముఖ్యతను గురించి గురువారం సూపర్‌వైజర్ బాలమణి అంగన్‌వాడీ చిన్నారులు, బాలింతలు, కిషోరబాలికలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వారికి సూచించారు. మహిళల్లో రక్తహీనత, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అందుకోసం చిరుధాన్యాలను తినాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కళావతి, అంజనమ్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : మాట్లాడుతున్న అనురాధ

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీలోని విఠాయిపల్లి, శంకర్‌కొండ తండాలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పోషక పదార్థాలు, పోషక విలువల గురించి బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సూపర్‌వైజర్ చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, రాధమ్మ, జయమ్మ, బుజ్జి, సుజాత, బికిని , బాలింతలు, గర్భిణీలు , తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. గురువారం మండల పరిధిలోని దామరిగిద్ద గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ సుజాత, గర్భిణులు, ఆశావర్కర్లు, గ్రామస్థులు, ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఆమనగల్లు : పూజల్లో భక్తులు

ఆమనగల్లు, మార్చి 21 : ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలి వస్తున్నారు. వారి కోసం ఆలయ నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బికుమాండ్ల పాండయ్య, కట్ట దేవేందర్‌శెట్టి, బికుమాండ్ల నర్సింహ, పాల్గొన్నారు.

ఈ నెల 30న హనుమాన్ విగ్రహానికి శంకుస్థాపన



ఇబ్రహీంపట్నం : రథాలను ప్రారంభిస్తున్న శ్రీ విద్యారణ్య భారతి స్వామి

ఇబ్రహీంపట్నం : ఈ నెల 30న ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొనకట్ట వద్ద శ్రీ హరిహర అఖండ క్షేత్రంలో ప్రతిష్ఠించబోయే 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహానికి శంకుస్థాపన చేస్తున్నట్లు అఖండ క్షేత్ర సమితి వ్యవస్థాపకుడు సదా వెంకట్‌రెడ్డి చెప్పారు. గురువారం జగద్గురు శంకరాచార్యులు శ్రీ విద్యారణ్య భారతి స్వామితో కలిసి శంకుస్థాపన జరిగే స్థలాన్ని అఖండ క్షేత్ర సమితి సభ్యులు పరిశీలించారు. పూజలు చేసి, ప్రచార రథాలను ప్రారంభించారు. 30న ఉదయం 9.44 గంటలకు జరిగే ఈ శంకుస్థాపనలో శ్రీవిద్యారణ్య భారతి స్వామితోపాటు రుత్విక్కులు పాల్గొంటారని తెలిపారు.

కల్వర్టుల విధ్వంసంపై ఫిర్యాదు



అడ్డంగా కట్టిన గోడను పరిశీలిస్తున్న నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 21 : షాద్‌నగర్ పట్టణం మీదుగా ఉన్న పాత జాతీయ రహదారిపై జరుగుతున్న కల్వర్టుల విధ్వంసంపై మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విధ్వంసానికి గురవుతున్న కల్వర్టులను ఆయన పరిశీలించి, అధికారులకు ఫిర్యాదు చేశారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని జడ్చర్ల రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన నేషనల్ మార్ట్ యాజమాన్యం కల్వర్టుకు అడ్డంగా గోడను నిర్మించి, చిన్న పైపులు వేసిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కల్వర్టుకు అడ్డంగా గోడను ఎలా నిర్మిస్తారని ఆ మార్ట్ మేనేజర్‌ను నిలదీశారు. భారత్ పెట్రోల్ బంకు వద్ద ఏకంగా కల్వర్టునే మూసివేయడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తున్నాయని గుర్తుచేశారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ రోడ్డు పక్కన ఉన్న 171 సర్వేనెంబర్‌లో వర్షపు నీరు వెళ్లకుండా కల్వర్టును పూర్తిగా మూసివేశారని తెలిపారు. లింగారెడ్డిగూడ శివారులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కల్వర్టుకు అడ్డంగా గోడ కట్టాడని ఆరోపించారు. షాద్‌నగర్ చౌరస్తా నుంచి కొత్తూర్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు కల్వర్టుల నిర్మాణాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, ఆక్రమణలను తొలగించి, కల్వర్టులను నిర్మించాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న వీర్లపల్లి

కేశంపేట, మార్చి 21 : స్థానిక సంస్థల ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మండల పరిధిలోని నిర్దవెల్లి ఎంపీటీసీ దిద్దెల కిష్టమ్మ గురువారం షాద్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, జంగయ్య, మఖుల్, వజీర్ పాల్గొన్నారు.

చౌదరిగూడ : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు కొనసాగుతున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇంద్రనగర్ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ చెందిన కార్యకర్తలు మండలాధ్యక్షుడు రాజు, శేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ సత్యనాయణరెడ్డి, వెంట్‌నర్సింహారెడ్డి, ఏజాజ్‌ఆలీ, వాసు, రాములు, యాదయ్య, పాల్గొన్నారు.

కొందుర్గు : మండలంలోని శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్‌ఛైర్మన్ సయ్యద్ సాధిక్, భీమిడి అశోక్‌రెడ్డి, చిన్నఎల్కిచర్ల మాజీ సర్పంచ్ ఆరీఫ్ ఆహ్మద్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నారు. బాబర్‌ఖాన్, దామోదర్‌రెడ్డి, జంగయ్య, బి రోహిత్‌రెడ్డి, రవీందర్ యాదవ్, భుజంగరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రీతమ్‌ను కలిసిన నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కొత్తూర్, మార్చి 21 : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన నగరిగారి ప్రీతమ్‌ను కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కర్రొళ్ల సురేందర్, నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్, నరేందర్, భాస్కర్, సాయిలు, రవికుమార్, ఎర్రొళ్ల జగన్, మాణయ్య, ప్రసాద్, రమేష్, అమృతయ్య, ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రానున్న ఆర్ఎస్ ప్రవీణ్

మాడ్గుల, మార్చి 21 : మాడ్గుల మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించబోయే లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఈనెల 24న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కాబోతున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం జరిగే పూజలకు ఆయన హాజరవుతారని చెప్పారు.

ఎన్నికలు సజావుగా జరపడానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

కందుకూరు, మార్చి 21 : లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరుగడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి సహాయ రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని మహేశ్వరం నియోజకవర్గం(50) పరిధిలోని అన్ని సెక్టార్, పోలీసు, బూత్ లెవల్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. మహేశ్వరం జోన్ డీసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డి, అడిషనల్ డీసీపీ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అల్లర్లకు తావునివ్వకుండా ,అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై ఎప్పటికప్పుడు ఆయా సెక్టార్ల అధికారుల పర్యవేక్షణ తప్పకుండా ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ భూతులోని ఓటర్లు తమతమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రతి ఓటర్‌ను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో బాలాపురం, కందుకూరు తహసీల్దార్లు మాధవరెడ్డి, కె.గోపాల్, నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.శేఖర్, వివిధ మండలాలు, మున్సిపాల్టీలు, గ్రామాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ విజయానికి చొరవ



సమావేశంలో మాట్లాడుతున్న రఘుమారెడ్డి

మహేశ్వరం, మార్చి 21 : చేవెళ్ల ఎంపీ టికెట్‌ను పార్టీ అధిష్టానం ఎవరికి కేటాయించినా ఆ అభ్యర్థి గెలిపించడానికి కార్యకర్తలు చొరవతో కృషి చేయాలని మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గట్టుపల్లిలో జరిగిన కాంగ్రెస్ గ్రామ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది ఏళ్లుగా బీఆర్ఎస్ అరాచకాలకు ప్రజలు విసిగిపోయారని ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పారన్నారు. అదే తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఘట్టుపల్లి మాజీ సర్పంచ్ రాకేష్‌రెడ్డి, నాయకులు మల్లప్ప, అంజయ్య, యాదగిరి, సంజీవ, మహ్మద్, పాల్గొన్నారు.

డీఎస్పీ మండల కమిటీల ఎన్నిక



కొత్త కమిటీల నాయకులతో భిక్షపతి

చౌదరిగూడ, మార్చి 21 : ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) మండల నూతన కమిటీని రాష్ట్ర నాయకుడు భిక్షపతి, జిల్లా కన్వీనర్ రాకేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చెన్నగళ్ళ గిరి, కో కన్వీనర్‌గా నర్సింహ, మీడియా ఇన్‌చార్జిగా శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. గ్రామాల్లో డీఎస్పీని విస్తరింప జేసేందుకు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు గిరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ నర్సింహ, నరేష్, శ్రీను, సాయిలు, సత్యం, రమేష్ పాల్గొన్నారు.

కొందుర్గు : డీఎస్పీ కొందుర్గు మండల నూతన కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం భిక్షపతి తెలిపారు. మండల అధ్యక్షుడిగా డప్పు రవీందర్, కో కన్వీనర్‌గా రాములు, విజయ్, శివ, కోశాధికారిగా సంజీవ, మీడియా ఇన్‌చార్జిగా మరాఠి రమేష్‌ను ఎన్నిక చేసినట్లు చెప్పారు. అశోక్, వెంకటయ్య, సతీష్ పాల్గొన్నారు.

కోటి మొక్కలు నాటడమే లక్ష్యం



మొక్క నాటుతున్న సుధారెడ్డి

మొయినాబాద్, మార్చి 21 : రాబోయే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధారెడ్డి తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మొయినాబాద్ మండల కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ ఏడాది జూన్ ఐదున ప్రపంచ పర్యావరణ దినోత్సవం నుంచి మొక్కలు నాటడం వేగవంతం చేస్తామన్నారు. ప్రజలందరు మొక్కలునాటేందుకు ముందుకు రావాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

● **యాచారం, మార్చి 21** : యాచారం మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో రూ.4 కోట్ల 54 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నామని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా చెప్పారు. గురువారం యాచారంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేయిస్తున్నట్లు చెప్పారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలసిన నివేదిక ఇస్తే సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని పంచాయతీ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ లేకుండా పనులు చేయాలని ఆమె చెప్పారు. ప్రతి గ్రామంలో భూగర్భడ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు.

● **కొత్తూర్** : కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు ఎర్రవెళ్లి నవీన్‌చారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన స్నేహితులు స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులకు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించి, నవీన్‌చారికి వారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెంటయ్య, రామకృష్ణ, దీపక్ చారి, రవీందర్‌రెడ్డి, అరుణ్, రాఘవేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో వంట కార్మికురాలి మృతి

చౌదరిగూడ, మార్చి 21 : మండల పరిధిలోని వీరన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంట కార్మికురాలిగా పని చేస్తున్న తాండ్ర అనసూయ(53) అనే మహిళ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో గురువారం ఉదయం ఇంటి వద్దనే చనిపోయింది. పదిహేను సంవత్సరాలుగా ఆమె ఆ పాఠశాలలో వంట కార్మికురాలిగా పనిచేసింది. ఆమె అకస్మాత్తుగా గుండె పోటుతో మరణించడం చాలా బాధాకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, నర్సింహులుతో పాటు గ్రామస్థులు ఆవేదనకు గురయ్యారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మౌనంపాటించి పాఠశాలకు సెలవు ప్రకటించారు.

అదుపు తప్పి గూడ్స్ ఆటో బోల్తా



బోల్తా పడిన గూడ్స్ ఆటో

నందిగామ, మార్చి 21 : నందిగామ పోలీస్ స్టేషన్ పరిధి చంద్రాయన్‌గూడ శివారులోని పాత జాతీయ రహదారిపై ఓ గూడ్సు ఆటో బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం కొత్తూరు నుంచి షాద్‌నగర్‌కు వెళుతున్న గూడ్సు ఆటో మార్గమధ్యలో నందిగామ మండలం చంద్రాయన్‌గూడ సమీపంలో టైరు పగిలి అదుపుతప్పి పాత జాతీయ రహదారిపై బోల్తా పడింది. అదే సమయంలో ఆటో వెనుక నుంచి వస్తున్న కారు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కాగా ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కారు, బైక్ ఢీ.. చికిత్స పొందుతూ ఒకరి మృతి



శ్రీను(ఫైల్‌ఫొటో)

చౌదరిగూడ, మార్చి 21 : కారు, బైక్ ఢీకొనగా ఓవ్యక్తికి గాయాలై చికిత్స పొందుతూ అతను మృతి చెందిన సంఘటన జిల్లేడ్ చౌదరి గూడ మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగింది. ఎస్సై సక్రం తెలిపిన వివరాల ప్రకారం పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన జాలరి శ్రీను (40) అనే వ్యక్తి తన బైక్‌పై గురువారం ఉదయం వీరన్నపేట్‌కు గడ్డం చేసుకోవడానికి కోసం వెళుతున్నాడు. పెద్ద ఎల్కిచర్ల గ్రామ శివారులోని కట్టపై ఏపీ 11 ఏపీ 0055 నెంబరు గల ఇన్నోవా కారు డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్‌పై ఉన్న శ్రీను కింద పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు ఎస్సై సక్రం తెలిపారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బొప్పిడి గోపాల్

కడ్తాల్, మార్చి 21 : ఆపదలో ఉన్నవారికి రక్తదాతలే ప్రాణదాతలుగా నిలుస్తారని ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి బొప్పిడి గోపాల్ అన్నారు. రక్తం, అవయవ దానాలపై ప్రజలు అపోహలు వీడాలని ఆయన సూచించారు. కడ్తాల మండలం రావిచేడ్ గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన పీ.వి నర్సింహారావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సుధాకిరణ్ సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శిబిరాన్ని బొప్పిడి గోపాల్ ప్రారంభించారు. 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారతమ్మవిఠలయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రంగయ్య, స్థానిక నాయకులు సాయి, బాలకృష్ణ ,నర్సింహ్మా, మహేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీకి వానపాముల పంపిణీ

యాచారం, మార్చి 21 : వివిధ గ్రామాల్లోని తడి, పొడి చెత్త కేంద్రాల్లో వర్మీకంపోస్ట్ తయారు చేసేందుకు ఉపయోగించే వానపాములు బుధవారం సాయంత్రం యాచారంకు చేరాయి. ఆరు నెలల క్రితం 22 గ్రామపంచాయతీలకు వానపాములను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. వాటితో సేంద్రియ ఎరువులు తయారు చేయించడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారు. కాగా బుధవారం మళ్లీ 24 గ్రామపంచాయతీలకు ప్రభుత్వం వానపాములను పంపించింది. వాటితో వర్మీకంపోస్ట్, సేంద్రియ ఎరువులు విధిగా తయారు చేయించాలని పంచాయతీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. విధిగా సేంద్రియ ఎరువులు తయారు చేయాలని డీపీఓ పంచాయతీ అధికారులను ఆదేశించారు. కంపోస్టు తయారీ పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



నగదును అందజేస్తున్న అవినాష్‌రెడ్డి

షాబాద్, మార్చి 21 : దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న దేవాలయానికి తన వంతు సహాయంగా రూ. 3 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్న నర్సింహారెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం కమిటీ ఎన్నిక



నియమాక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి శాలిని

మొయినాబాద్, మార్చి 21 : మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్ శాలిని సమక్షంలో ఎన్నిక ఏకగ్రీవం అయింది. అధ్యక్షుడిగా పొన్న ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా నాగభూషణం, సభ్యులుగా నరసింహ, సుదర్శన్, నరేంద్ర, నరేందర్ ఎన్నికయ్యారు.

నందిగామ : నందిగామ మత్స్యకారుల సహకార సంఘం నూతన కమిటీని గురువారం ఆ సంఘం జిల్లా ఎన్నికల అధికారి రమేష్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డమీది యాదయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా పల్లెమోని రాములు ముదిరాజ్, కార్యదర్శిగా ఈట మల్లేష్, సభ్యులుగా శ్రీకాంత్, రాంచంద్రయ్య, శ్రీనివాస్, యాదయ్య, శివకుమార్, నర్సింలు, మల్లేష్‌ను ఎన్నుకున్నారు. చెరువులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారి అభివృద్ధి కోసం తన వంతుగా కృషిచేస్తానని అధ్యక్షుడు యాదయ్య అన్నారు.